క్లుప్తంగా

ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓగా పద్మజ



పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓగా కె.పద్మజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ కార్యాలయ ఏఓగా పనిచేసిన సరస్వతి అనపర్తి తహసీల్దార్‌గా బదిలీ కావడంతో జగ్గంపేట ఎన్నికల డీటీ కిలిమి పద్మజకు ఇన్‌చార్జి ఏఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆమె ఎఫ్ఏసీ ఏఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పద్మజ విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని మండలాలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రజలకు సేవలందిస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా..

పెద్దాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఎం.సత్యనారాయణ మూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఎంపీడీఓగా పదోన్నతిపై వెళ్లారు. ఆయన స్థానంలో బిక్కవోలు పంచాయతీరాజ్ సబ్ డివిజన్ సీనియర్ సహాయకులుగా ఉన్న సత్యనారాయణ మూర్తిని పదోన్నతిపై ఇక్కడ నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతిలను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

డ్రైన్‌లో చెట్ల తొలగింపు



ప్రధాన డ్రైన్‌లో చెట్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్ నుంచి రైల్వే గేటుకు వెళ్లే మార్గంలోని ప్రధాన డ్రైన్‌లో చెట్ల తొలగింపు కార్యక్రమం సోమవారం కొనసాగింది. ఇటీవల ఈదురు గాలుల కారణంగా ప్రధాన డ్రైన్ సమీపంలోని చెట్లు కూలిపోయిన విషయం విధితమే. ఈ మేరకు ప్రధాన డ్రైన్‌లో చెట్లు పడిపోవడంతో మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతుంది. దీనిపై 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి కమిషనర్ జె.రామారావు స్పందించారు. స్వయంగా ఆయన డ్రైన్‌ను పరిశీలించి చెట్ల తొలగింపునకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు చెట్ల తొలగింపు పనులను కమిషనర్ పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

పిఠాపురం: ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ గొల్లప్రోలు మండలాధ్యక్షుడు పోసిన సత్యనారాయణ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు చిట్టా మధు, బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణరాజు, కర్రి సత్యనారాయణ, యెడ్ల అనురాధ, కరణం భవానీ, పిల్లా ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో మధుమేహం దూరం



సామర్లకోటలో మధుమేహ పరీక్షలు చేయిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: నిత్యం వ్యాయామం చేయడం ద్వారా మధుమేహాన్ని దూరం చేయవచ్చని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక 23వ వార్డులో ప్రజలకు సుగర్ పరీక్షలు చేశారు. మున్సిపాలిటీ పరిధి 31వ వార్డుల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వీర్రాజు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.సుధారాణి, ఎస్.సురేష్, కర్రి ఆదినారాయణరెడ్డి, మేకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుబ్బిరెడ్డి మృతి తీరనిలోటు

కొత్తపల్లి: సెజ్ వ్యతిరేఖ పోరాట కమిటీ నాయకుడు పెనుమల్లు సుబ్బిరెడ్డి మృతి తీరని లోటని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి అన్నారు. మండలంలోని రమణక్కపేటలో సోమవారం సుబ్బిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత సుబ్బిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సెజ్ భూముల కోసం ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.నాగేశ్వరరావు, కాళ్ల నాగేశ్వరావు, జి.వెంకటసుబ్బిరెడ్డి, సీహెచ్ నారాయణరెడ్డి, చీకట్ల సాంబశివకుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికతో సాగుదామా..

- భూసార పరీక్షలతో సాగు.. బాగు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- రసాయన ఎరువుల వినియోగానికి దూరం



పెద్దాపురంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్దాపురం: కాలం మారింది.. సాగులో రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. ఇదే భూమిలో పోషకాలను హరిస్తోంది.. భూమి నిస్సారమై పంటల దిగుబడులపై ప్రభావం పడుతోంది.. దీనిని గుర్తించిన ప్రభుత్వం రైతన్నలకు ఆసరాగా నిలుస్తోంది.. సేంద్రియ సాగుకు విధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అంతేకాకుండా భూసార పరీక్షల ద్వారా ఎరువులు ఎంత మేర వాడాలో వ్యవసాయ శాఖ ద్వారా సూచనలు ఇస్తోంది. ఈ మేరకు పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులతో భూమిని సారవంతం చేయాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో సామర్లకోట మండలంలో 22,250 ఎకరాలు, పెద్దాపురం మండలంలో 9,892 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. ఎరువులు ఎక్కువ మోతాదులో పంట పొలాల్లో వినియోగించడంతో భూమిలో పోషక విలువలు తగ్గి భూమి నిస్సారంగా మారుతోంది. కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాల్లో వ్యత్యాసాలు ఏర్పడి దిగుబడులు తగ్గడంతో పాటు చీడపీడలు ఆశిస్తున్నాయి. నియోజకవర్గంలో ఎక్కువ శాతం జింకు లోపంతో ఉన్న నేలలే అధికంగా ఉన్నట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి.

భూసార పరీక్షలు ఇలా..

సాగులో రైతులకు ఆసరాగా నిలిచేందుకు వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు చేస్తున్నారు. సాధారణ పొలంలో ఆరు అంగుళాల లోతు, చెరకు, అరటి తదితర పొలాల్లో ఎనిమిది అంగుళాల లోతులో 'వి' ఆకారంలో పారతో కట్ చేసి, మట్టి నమూనా సేకరించాలి. ఇలా ప్రతి ఐదెకరాలకు ఒక మట్టి నమూనాను సేకరిస్తారు. మట్టి నమూనాతో పాటు రైతు పేరు, సర్వే నంబరు, విస్తీర్ణం, ముందు వేసిన పంట– వేయబోయే పంట, వినియోగించిన ఎరువుల వివరాలను పొందుపరుస్తారు. వీటిని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ (భూసార పరీక్షా కేంద్రానికి)కు తరలించి పరీక్షలు చేస్తారు. భూసార పరీక్ష అనంతరం సేంద్రియ కర్బనం, ఎలక్ట్రికల్ కండక్టవిటీ (ఈసీ), ఉదజని సూచిక (పీహెచ్), నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ మూలకాలు తదితర ధాతు లోపాలు కార్డుపై నమోదు చేసి రైతుకు అందిస్తారు. దీంతో లోపాలు సవరించేందుకు కార్డులో ఇచ్చిన ధాతువులు పొలంలో వేసుకుంటే భూమిలో సిరులు పండుతాయి. ఈ పరీక్షలు ఖరీఫ్ ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

పరీక్షలతో లాభాలు

భూసార పరీక్షల ద్వారా సాగులో ఎరువుల వినియోగం తగ్గుతుంది. తద్వారా పెట్టుబడి తగ్గించుకోవచ్చు. భూమిలో ఏం లోపాలు ఉన్నాయో తెలుస్తాయి. దీనివల్ల తెగుళ్లు, పురుగుల నివారణ సాధ్యమవుతుంది.

పచ్చిరొట్ట విత్తనాలు వేయాలి



గతంలో రైతులు ఎరువులకు బదులు పెంట గెత్తాలు, పచ్చిరొట్ట ఎరువులైన పిల్లపెసర, కట్టీ జనుము తదితరాలు వినియోగించేవారు. భూసారం పెరిగి మంచి పంటలు పండేవి. నేడు రసాయనిక ఎరువుల వాడకంతో ఖర్చు పెరిగి వ్యవసాయం భారంగా మారింది. ఈ పరిస్థితి నుంచి అధిగమించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, పిల్లి పెసర 75 శాతం రాయితీపై వ్యవసాయశాఖ అందిస్తోంది. రైతులు వినియోగించుకుని భూసారం పెంచుకోవాలి.

–కె.సంజయ్‌కుమార్, ఏఓ, పెద్దాపురం మండలం

బందోబస్తు నడుమ చెరువులో చేపల వేట



చెందుర్తిలో చేపల చెరువు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి పెద్ద చెరువులో చేపలు పట్టుకునే విషయంలో స్థానికంగా రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో సోమవారం పోలీసు బందోబస్తు నడుమ చేపల వేట నిర్వహించారు. మత్స్యశాఖ అధికారుల సమక్షంలో పాత సంఘం వారికే చేపలు పట్టుకునే అవకాశం ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఎటువంటి వివాదం చోటు చేసుకోకుండా గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇటీవల గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో రెండు సంఘాల నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మత్స్యశాఖ అధికారుల సమక్షంలో పాత సంఘం వారికే చేపలు పట్టుకునే అవకాశం ఇస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేస్తే కోర్టు ధిక్కారణ కింద వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భీమేశ్వరా.. సర్వేశ్వరా..

భక్తులతో కిటకిటలాడిన పంచారామ క్షేత్రం

సామర్లకోట: చల్లగ చూడు భీమేశ్వరా అంటూ భక్తజనం ఆ స్వామివారిని మనసారా కొలిచింది.. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులు కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. భక్తులకు దేవస్థానం తరఫున అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యుడు, దేవదాయ శాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం మధ్యాహ్నం స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. క్షేత్రంలో వేంచేసి ఉన్న మహిషాసుర మర్దిని ఆలయంలో ఆషాఢ మాసం అష్టమి సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ పూజాదికాలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు.

ఒకటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు

స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయానికి రంగులు, విద్యుత్తు దీపాలంకరణ పనులు ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు, కార్యదర్శి జి.సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం మేలుకొలుపు హారతి, అభిషేకాలు, పూజలు ఉంటాయన్నారు. 2వ తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద బాలికలచే పాటలు, కోలాట ప్రదర్శన, 3.30 గంటలకు ఆలయం నుంచి బాబావారి పల్లకి, వాహన ఉత్సవ ఊరేగింపు జరుగుతుందన్నారు. 3న గురుపూర్ణిమ సందర్భంగా తెల్లవారు జామున మేలుకొలుపు హారతి, బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు చేస్తారు. అనంతరం స్థానిక రైల్వే కల్యాణ మండపంలో అన్నసమారాధన ఉంటుందని చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో మహిషాసుర మర్దిని అమ్మవారు

పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



జగ్గయ్య చెరువు కాలనీలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 21వ వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. తమకు నవరత్న పథకాలు అందుతున్నాయంటూ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై చంద్రబాబు అత్యంత చులకనగా మాట్లాడారన్నారు. ఆయన హయాంలో పేదలకు అర సెంటు భూమి కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే సంతోషించాల్సింది పోయి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పేదల ఇళ్ల స్థలాలను శ్మశానం అని మాట్లాడిన చంద్రబాబు ఒక్కసారి ఇక్కడకు వచ్చి పేదల నూతన గృహాలను చూసి మాట్లాడాలన్నారు. నిరు పేదల ఆశల హరివిల్లులైన ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోల్చిన టీడీపీ అధినేత చంద్రబాబు పేదలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చూసి ఓర్వలేక టీడీపీ నేతలు నోటికొచ్చిన మాటాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు, టీడీపీ శ్రేణులకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బాలిపల్లి రాంబాబు, ఉలవల భూషణం, కొత్తపల్లి బుజ్జి, కౌన్సిలర్లు కావాడ పూసయ్య, చింతాడ నీలవేణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నేతలు సోమవారం పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీకి చెందిన చిక్కిరెడ్డి జ్యోతి, చిక్కిరెడ్డి శేషుకుమార్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

'స్పందన'కు ఏడు అర్జీలు

పెద్దాపురం: డివిజన్ స్థాయిలో నిర్వహించిన 'స్పందన'కు ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు అందాయని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ పద్మజ, డీటీ భానుకుమార్ తెలిపారు. స్థానిక దర్గా సెంటర్‌లో స్థల ఆక్రమణ ఖాళీ చేయించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని, తొలగించిన విద్యుత్ మీటర్‌ను పునరుద్ధరించాలని తదితర సమస్యలపై ఏడుగురు ఫిర్యాదులు అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యను పరిష్కస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించారు. పలు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. వాకతిప్పకు చెందిన జ్యోతుల మునిరత్నం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె భర్త జ్యోతుల నారాయణ స్వామిని ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే అమీనాబాద్‌కి చెందిన డోక్కా సత్యవతి, పొన్నాడ శివారు కొనపాపపేటకు చెందిన కారే ఎల్లయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి మృతి చెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అమీనాబాద్ తీరప్రాంతంలో బోటు బోల్తాపడిన ఘటనలో గాయలైన చెల్లూరి లోవరాజు, అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కుప్పిలి పోలేరమ్మ కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి తెలిపారు. సోమవారం స్థానిక గాంధీచౌక్ రైతు భవనంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆటో, లారీ, కార్లను నడిపే సమయంలో డ్రైవర్లు తమ కుటుంబాన్ని గుర్తు చేసుకుని బాధ్యతగా వెళ్లాలన్నారు. అతివేగం కారణంగానే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇచ్చి నేరాలను అదుపు చేయడానికి ఆటో డ్రైవర్లు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ప్రతి వాహనంలో డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ, బీమా పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోడ్రైవర్ల పిల్లల చదువుకు సంబంధించి తన వంతు సహాయం అందజేస్తానని ఆమె హామీ ఇచ్చారు. సీఐ కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆటో ప్రమాదాల్లో ఎక్కువ మంది చనిపోతున్నారని, ఇటువంటి సంఘటనల నివారణకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశానికి ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అధ్యక్షత వహించగా ఏఎస్సై రత్నం, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్, ఆటో, ట్యాక్సీ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



చేబ్రోలు విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పలు విత్తన దుకాణాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెద్దాపురం వ్యవసాయ శాఖ డీడీ బీవీఎస్ హరి, పెద్దాపురం, తుని, గొల్లప్రోలు మండలాల వ్యవసాయ శాఖాధికారులు కె.సంజీవ్ కుమార్, అశోక్, కేవీవీ సత్యనారాయణ తదితరులు చేబ్రోలులోని సాయికృష్ణ ఏజెన్సీస్, సాయి దేవి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీలు చేశారు. సాయి కృష్ణ ఏజెన్సీస్‌లో రికార్డులకు, స్టాక్‌కు తేడాలు ఉండడంతో రూ.2,17,500 విలువైన 235 ప్యాకెట్ల విత్తనాల అమ్మకాలను నిలుదల చేశారు. పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- ఆనూరులో గడప గడపకూ..



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. సోమవారం పెద్దాపురం మండలం ఆనూరు గ్రామంలో సర్పంచ్ నూకతాటి అనితారాణి, సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సింగన శివ, నాగబోయిన రాజుబాబుతో కలసి సుమారు మూడున్నర గంటల పాటు గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించారు. ప్రజలకు అందుతున్న పథకాలను తెలుసుకుని సమస్యలపై ఆరా తీశారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ మహిళాభివృద్ధి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. పార్టీ రహితంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, కామన రామకృష్ణ, పెంకే రాంబాబు, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న నంది ఉత్సవం

పిఠాపురం: స్థానిక పాదగయ కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు నంది ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని నందీశ్వరునికి ప్రత్యేక ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందాలని కోరారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



పీబీ దేవంలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీలలిత

కొత్తపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల ప్రత్యేకాధికారి పుష్పమణి అన్నారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, ఉప్పాడ గ్రామా సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్షపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకోవాలన్నారు. జూలై ఒకటి నుంచి వారికి కావలసిన సర్టిఫికెట్లు ఉచితగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

సామర్లకోట: జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి వలంటీర్లు చేస్తున్న సర్వేను ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం పరిశీలించారు. పీబీ దేవం ఒకటో సచివాలయం పరిధిలో వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తున్న అంశాలపై సమాచారం సేకరించారు. ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు అందే విధంగా చూడాలని ఆమె ఆదేశించారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మలకల వరలబాబు, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

జి.రాగంపేటలో..

పెద్దాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని గృహ సారథుల పెద్దాపురం మండల కన్వీనర్ గోపు మురళి, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు అన్నారు. జి.రాగంపేటలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందాలనే ఉద్దేశంతో సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలన్నారు. అనంతరం పలు అంశాలపై సిబ్బందితో సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: జగనన్న సురక్షలో భాగంగా జూలై ఒకటో తేదీ నుంచి ప్రతి సచివాలయంలో అందజేస్తున్న ఉచిత సర్టిఫికెట్లపై ప్రజలకు అవగాహన పెంచాలని పట్టణ గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి అన్నారు. స్థానికంగా ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 14వ వార్డులో కౌన్సిలర్ స్వయం భారపు వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయి మాట్లాడారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పెద్దాపురంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల, మానవ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానికంగా వైజ్ సీబీఓ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని పెద్దాపురం మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరయ్యచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తులో అనేక నేరాలకు ఆస్కారం ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టడం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. వైజ్ సంస్థ అధ్యక్షులు బి.మల్లీశ్వరి, పీడీ జయ, పీఎం డి.రాజు, ఎంఅండ్ ఈఏ బాబు మాట్లాడూతూ మాదక ద్రవ్యాల వినియోగం నుంచి యువతను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం మున్సిపల్ సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా దర్గాసెంటర్, పాతబస్టాండ్ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు సీహెచ్ ఏసుబాబు, తాతాజీ, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

పిఠాపురం: మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి యువత పెడదోవ పట్టకుండా చూడాలని గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్యురాలు శ్యామల అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మనుషులను పశువులుగా మార్చే మాదకద్రవ్యాలను తరిమికొట్టక పోతే సమాజం బాగుపడదన్నారు. జిల్లా సమతా కన్వీనర్ సీహెచ్‌యూఆర్ మంగతాయారు, కళాశాల ఇన్‌చార్జ్ ఎస్ఆర్ స్వామి, జి.సూరిబాబు, డీవీకే వర్మ, జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.